తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT









సంపుటి: 1 | సంచిక: 42 | పేజీలు: 4 | ఎడిటర్ : బక్క రవీందర్ | ప్రచురణ: తెలంగాణ | శుక్రవారం 13 -9-2024 | వెల: 5/రూ -


## సంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పు

# బాలికపై హత్యచారం చేసిన నిందితుడికి ఉరిశిక్ష



**బాధితురాలి కుటుంబీకులకు రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని ఆదేశాలు**

**నిందితునికి ఉరిశిక్ష పడేలా కృషి చేసిన వారికి ఎస్పీ అభినందనలు**




**ఐదేళ్ల పసిపాపను అతికిరాతకంగా అత్యాచారం చేయడమే కాకుండా ఆ చిన్నారిని క్రూరంగా చంపేసిన నిందితుడికి మరణశిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పును వెల్లడించింది. సరిగ్గా 27 ఏళ్ల తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఈ కోర్టులో తిరిగి మళ్లీ మరణ శిక్ష విధించడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది.**

**సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 12,(డైలీరిపోర్ట్):** ఓ ఐదేళ్ల పసిపాపను అతికిరాతకంగా అత్యాచారం చేయడమే కాకుండా ఆ చిన్నారిని క్రూరంగా చంపేసిన నిందితుడికి మరణశిక్ష విధిస్తూ సంగారెడ్డి జిల్లా కోర్టు సంచలన తీర్పును వెల్లడించింది. సరిగ్గా 27 ఏళ్ల తర్వాత ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఈ కోర్టులో తిరిగి మళ్లీ మరణ శిక్ష విధించడం సర్వత్ర చర్చనీయాంశంగా మారింది. బాధితురాలి కుటుంబ సభ్యుల పక్షాన అటు పోలీసులు, ఇటు న్యాయవాదులు నిలబడి నిందితుడికి ఉరిశిక్ష పడేలా కృషి చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ గురువారం ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వెల్లడించారు.బీహార్ రాష్ట్రం జిమోయి జిల్లా సికిందర్ తాలూకాకు చెందిన గఫార్ అలీ (56) గత ఏడాది 16-10-2023 తేదీన వీడియో పోలీస్ స్టేషన్ పరిధిలోని చైతన్య కంపెనీ పక్కన లేబర్ రూమ్ లో నివాసం ఉంటున్నాడు. అయితే అదే రోజు స్థానిక శంకర్, అతని భార్య ఉమాదేవిలు తమ 5 సంవత్సరాల మనుమరాలిని సెక్యూరిటీ గార్డ్ వద్ద ఉంచి చైతన్య కంపెనీలోనికి పనికి వెళ్లారు. వీరి లేబర్ రూమ్ ప్రక్క రూంలో ఉండే, నేరస్తుడు గఫార్ పనికి వెళ్లకుండా మద్యం సేవించి తిరుగుతుండగా సుమారు 11.00 గంటల సమయంలో సెక్యూరిటీ గార్డ్ వద్ద పాప కనిపించింది.ఆ పాప తనకు తెలిసిన పాప అని కూల్ డ్రింక్ తాగించి తీసుకొని వస్తానని చెప్పి.. తీసుకొని మద్యం కలిపిన కూల్ డ్రింక్ తాగించి పత్తి చేను లోకి తీసుకొని వెళ్ళి పాపపై అత్యాచారం చేశాడు. ఎవరికైనా చెబుతుందేమో నన్న ఉద్దేశంతో పాపను గొంతు నులిమి హత్య చేశాడు. ఈ మేరకు అప్పటి ఎస్సై రవీందర్ రెడ్డి నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. గురువారం కేసు కు సంబంధించిన వాదోపవాదాలు విన్న పోక్సో కోర్టు న్యాయమూర్తి జయంతి నిందితునికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చారు.బాధితురాలి రక్త సంభందికులకు 10 లక్షల నష్టపరిహారం ఇవ్వవలసిందిగా న్యాయమూర్తి జయంతి ఆదేశించారు. ఈ కేసులో సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ప్రత్యేక దృష్టి సారించి, హై కోర్ట్ కు వెళ్ళి స్పీడ్ ట్రయల్ అనుమతి తీసుకొని కేవలం 11 నెలలలో నిందితునికి ఉరిశిక్ష పడేలా కృషి చేశాడు. దీంతో ఎస్పీని పోక్సో న్యాయమూర్తి అభినందించారు. నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు అదనపు ఎస్పీ సంజీవ రావు, అశోక్, అప్పటి ఎస్సై రవీందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ బిడియల్ భానూర్, ఇన్వెస్టిగేషన్ అధికారులు పురుషోత్తం రెడ్డి, పి.పి.లు అనంత రావ్ కులకర్ణి, కృష్ణ, భరోసా లీగల్ సపోర్ట్ పర్సన్ సౌజన్య, కోర్ట్ డ్యూటీ ఆఫీసర్స్ వెంకటేశ్వర్లు, రఫీక్, సీత నాయక్, కోర్ట్ లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణ ఎస్ఐ. డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ బి. రమేష్ లను ఎస్పీ అభినందించారు.

## కామ్రేడ్ ఏచూరి కన్నుమూత

**ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో బాధపడుతూ ఢిల్లీ ఎయిమ్స్‌లో తుదిశ్వాస**

- సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి రాష్ట్రపతి, ప్రధాని సహా పలువురు ప్రముఖులు, రాజకీయ నేతల నివాళి
- ప్రియతమ కామ్రేడ్‌ను కోల్పోవడం తీవ్ర విషాదకరమన్న సీపీఎం
- నేటి సాయంత్రం వసంత్‌కుంజ్‌లోని నివాసానికి భౌతికకాయం
- రేపు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పార్టీ ఆఫీసులో పార్థివ దేహం
- వైద్య పరిశోధనల నిమిత్తం భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు అప్పగించనున్న కుటుంబం



న్యూఢిల్లీ: ఎర్రజెండా నీడలో ప్రకాశించిన అరుణతార నేల రాలింది. దశాబ్దాలుగా అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడుతూ భారత కమ్యూనిస్టు రాజకీయాలపై చెరగని ముద్రవేసిన వామపక్ష యోధుడు, ప్రజా ఉద్యమకారుడు, సామాజిక వేత్త, కాలమిస్ట్, సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి (72) తుదిశ్వాస విడిచారు. న్యుమోనియాతో బాధపడుతూ

2లో



## మా కేసు సీజేఐ విచారిస్తున్నారు..

- న్యాయం జరుగుతుందా.. అన్న అనుమానం ఉంది
- శివసేన నేత సంజయ్ రౌత్ విమర్శలు
- సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయింది
- సుప్రీం బార్ అసోసియేషన్ ఖండించాలి: ఇందిరా
- సీజేఐ ఇంట్లో ప్రధాని పూజపై ప్రతిపక్షాల విమర్శలు
- సీజేఐ ఇంటికి ప్రధాని వెళ్లడం తప్పా?
- గతంలో మన్మోహన్ ఇఫ్తార్ విందుకు సీజేఐ వెళ్లలేదా?.. బీజేపీ ధ్వజం

2లో

### కేంద్ర అధికారాలను పరిమితం చేయకపోవడంతో అంతరాలు

కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 41 నుంచి 50 శాతానికి పెంచాలి

పునర్విభజన ద్వారా దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గించే కుట్ర: భట్టి

## అరెకపూడి, కౌశిక్ రెడ్డి మధ్య

# జెండా జగడం

- గాంధీ ఇంటికెళ్లి బీఆర్ఎస్ జెండా ఎగరేస్తానన్న కౌశిక్.. ఆయన విల్లాకు వెళ్లిన గాంధీ, ఆయన అనుచరులు
- టమాటాలు, కోడిగుడ్లతో దాడి, కిటికీలు, కుండీలు ధ్వంసం.. ప్రతిగా చెప్పులు విసిరిన బీఆర్ఎస్ కార్యకర్తలు
- గంటన్నరపాటు హైటెన్షన్.. గాంధీ అరెస్టు, విడుదల.. సైబరాబాద్ కమిషనరేట్‌కు హరీశ్, కౌశిక్.. ఫిర్యాదు
- గాంధీపై కేసు నమోదు చేయాలని బైఠాయింపు.. వారిని అరెస్టు చేసి కేశంపేట తీసుకెళ్లి వదిలిన పోలీసులు
- ఇది ప్రభుత్వ దాడి.. పోలీసుల వైఫల్యం: హరీశ్‌రావు.. నేడు గాంధీ ఇంటిని ముట్టడిస్తాం: కౌశిక్
- ప్రాంతీయ విభేదాలు సృష్టిస్తున్న కౌశిక్: అరెకపూడి.. గాంధీ, అనుచరులపై కేసు నమోదు




హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుపై రచ్చ రచ్చ! ఎమ్మెల్యేల మధ్య మాటల యుద్ధం! ఓ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి పార్టీ మారిన మరో 'బీఆర్ఎస్' ఎమ్మెల్యే! అక్కడ హై టెన్షన్ వాతావరణం! ఆయన అరెస్టు.. విడుదల! సీనులోకి మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు! సైబరాబాద్ పోలీసు కమిషనర్ కార్యాలయం వద్దా తీవ్ర ఉద్రిక్తత! అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టులు! వెరసి.. ఫిరాయింపులు, 'జెండా వివాదం' ఎమ్మెల్యేల మధ్య తీవ్రస్థాయి లొల్లికి దారి తీసింది! శేరిలింగంపల్లి రణరంగంగా మారింది. ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ) చైర్మన్‌గా ఇటీవల శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీని నియమించిన విషయం తెలిసిందే.

2లో

# కామ్రేడ్ ఏచూరి కన్నుమూత





(మొదటి పేజీ తరువాయి)

ఆగస్టు 19వ తేదీన ఢిల్లీలోని ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఐసీయూలో చేరిన ఏచూరి ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ తీవ్రమవడంతో రెండురోజుల క్రితం విదేశాల నుంచి మెడిసిన్ తెప్పించారు.

అది కూడా ఫలితాన్నివ్వకపోవడంతో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు సీతారాం ఏచూరి కన్నుమూసినట్లు ఎయిమ్స్ వైద్య బృందం ప్రకటించింది. ఆయన భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు పరిశోధనల నిమిత్తం దానంగా ఇవ్వనున్నారు. ఏచూరి కోరిక మేరకే ఆయన కుటుంబసభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏచూరి రెండు వివాహాలు చేసుకున్నారు. మొదటి భార్య పేరు ఇంద్రాణి మజుందార్. రెండో భార్య సీమ చిస్తీ. ఆయనకు కుమార్తె అఖిల, కుమారుడు డానిష్ ఉన్నారు. పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, దివంగత బుద్ధదేవ్ భట్టాచార్యకు నివాళులర్పిస్తూ ఆగస్టు 22న చివరిసారిగా ఏచూరి ఒక వీడియో సందేశంలో కన్పించారు. ‘అనారోగ్యం కారణంగా ఎయిమ్స్ నుంచే మాట్లాడాల్సి వస్తోంది. విప్లవ లాల్ సలామ్‌లు బుద్ధదేవ్ గారికి..’ అని ఆ సందేశంలో ఏచూరి అన్నారు.

ఏచూరి మరణంతో అటు కమ్యూనిస్టు పార్టీలోనూ, ఇటు కుటుంబసభ్యుల్లో తీవ్ర విషాదం నెలకొంది. ప్రియతమ కామ్రేడ్‌ను కోల్పోవడం తీవ్ర విషాదకరమని సీపీఎం పార్టీ ఒక ప్రకటనలో పేర్కొంది. ఏచూరి మృతిపై భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు పలువురు కేంద్రమంత్రులు, ప్రముఖులు, పార్టీలకు అతీతంగా రాజకీయ నేతలు తమ ప్రగాఢ సంతాపం ప్రకటించారు. ఏచూరి భౌతికకాయాన్ని శుక్రవారం సాయంత్రం 6 గంటలకు ఢిల్లీ వసంత్‌కుంజ్‌లోని ఆయన నివాసానికి తరలించనున్నారు. ప్రముఖులు, పార్టీ నేతలు, కార్యకర్తల నివాళులు, సందర్శనార్థం ఏచూరి పార్థివదేహాన్ని శనివారం పార్టీ ప్రధాన కార్యాలయంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఉంచుతామని సీపీఎం తెలిపింది. సాయంత్రం 5 గంటల తర్వాత ఎయిమ్స్‌కు అప్పగించనున్నారు.

**పరిశోధనల కోసం పార్థివ దేహం**

ఏచూరి పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల బోధన, పరిశోధనల కోసం దానం చేస్తున్నట్లు ఆయన కుటుంబీకులు అధికారికంగా ప్రకటించారు. పార్థివ దేహాలను పరిశోధనల కోసం దానం చేసే పద్ధతిని కమ్యూనిస్టులు కొంతకాలంగా కొనసాగిస్తున్నారు. ఇదే కోవలో పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం నేత బుద్ధదేవ్ భట్టాచార్య భౌతికకాయాన్ని కూడా దానం చేశారు. ఇలాగే మరికొందరి భౌతికకాయాలను కూడా ఆసుపత్రులకు అప్పగించారు.

**నేడు విదేశీ కమ్యూనిస్టు నేతల రాక**

ఏచూరి మరణవార్తను తెలుసుకున్న విదేశాలకు చెందిన కమ్యూనిస్టుల పార్టీల నేతలు, ఆయనకు నివాళులర్పించేందుకు ఢిల్లీ రానున్నారు. శుక్రవారం చైనా, నార్త్ కొరియా, వియత్నాం, క్యూబా వంటి దేశాల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. మూడురోజుల పాటు ఢిల్లీలోనే ఉండి పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

**1977**

అక్టోబర్ నెల.. ఓ నూనుగు మీసాల యువకుడి నాయకత్వంలో వందలాది విద్యార్థులు ఢిల్లీ వీధుల్లో కదం తొక్కారు. ఉక్కు మహిళగా పేరొందిన ఇందిరాగాంధీ ఇంటికి వారంతా ర్యాలీగా చేరారు. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఇందిర నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినప్పటికీ ఆమె జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ చాన్స్‌లర్ పదవిని మాత్రం వీడలేదు. దీన్ని వ్యతిరేకిస్తూ వారంతా నినాదాలు చేయడం ప్రారంభించారు. చివరికి ఇందిర తన నివాసం నుంచి బయటకు వచ్చారు. అప్పుడు లెగిచాడు.. జేఎన్‌యూ స్టూడెంట్ యూనియన్ ప్రెసిడెంట్ సీతారాం ఏచూరి. ఇందిర పక్కనే నిల్చుని.. ఆమె రాజీనామానే డిమాండ్ చేస్తూ.. మెమెరాండంను చదివి వినిపించాడు. ఈ ఘటన జరిగిన కొన్ని రోజులకే ఇందిర చాన్స్‌లర్ పదవికి రాజీనామా చేశారు.

**ఏపీతో ఏచూరికి ఎనలేని బంధం**

అస్తమించిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఆంధ్రప్రదేశ్‌తో చాలా అనుబంధం ఉంది. ఆయన స్వస్థలం కాకినాడ అయినా.. తండ్రి సర్వేశ్వర సోమయాజి బదిలీపై విజయవాడ ఆర్టీసీలో ఉన్నతాధికారిగా పనిచేసిన సమయంలో ఆరు, ఏడు తరగతులను ఏచూరి విజయవాడలోనే చదువుకున్నారు. ఆ తరువాత హైదరాబాద్‌కు వెళ్లారు. 1978లో స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్ఎఫ్ఐ) జాతీయ అధ్యక్షుడి హోదాలో విజయవాడకు వచ్చారు. విద్యార్థి నాయకుడిగా, సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడిగా, జనరల్ సెక్రటరీగా అనేక కార్యక్రమల్లో పాల్గొన్నారు.

గతేడాది నవంబర్‌లో ప్రజారక్షణభేరి ర్యాలీ, సభకు హాజరయ్యారు. 2022లో దేశ రక్షణ భేరి బహిరంగ సభకు వచ్చారు. అదే ఏడాది జనవరిలో పార్టీ రాష్ట్ర స్థాయి సమావేశంలోనూ పాలుపంచుకున్నారు. 2010లో సీపీఎం అఖిల భారత విస్తృతస్థాయి సమావేశాల్లో పాల్గొన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మూడు రోజుల పాటు విజయవాడలో ఉండి రాష్ట్రమంతా పర్యటించారు. చివరిగా ఈ ఏడాది మే 10న విజయవాడలో ఇండియా కూటమి నిర్వహించిన కార్యక్రమంలో ఏచూరి పాల్గొన్నారు. ఏచూరి విద్యాభ్యాసం, నివాసం అంతా ఢిల్లీ అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్ వచ్చినప్పుడు తెలుగులోనే మాట్లాడేవారు.

**విశాఖతో ప్రత్యేక అనుబంధం**

సీతారాం ఏచూరికి విశాఖతో ఎనలేని అనుబంధం ఉంది. 2015 ఏప్రిల్ 14 నుంచి 19వ తేదీ వరకు విశాఖలోని పోర్టు స్టేడియంలో నిర్వహించిన సీపీఎం 21వ జాతీయ మహాసభల్లో ఆయన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా ఢిల్లీస్థాయిలో పోరాడటంలోను, షిప్‌యార్డు, బీహెచ్‌పీవీ, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ రక్షణ కోసం జరిగిన ఉద్యమాల సందర్భంగా ఏచూరి ఢిల్లీ నుంచి విశాఖకు అనేక సార్లు వచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ స్థాపన కోసం జరిగిన ఉద్యమాల్లోను ఆయన పాల్గొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం ప్రకటన చేసిన తరువాత జరుగుతున్న ఉద్యమాల్లో కూడా ఆయన ప్రసంగించారు. గత ఏడాది అక్టోబర్ 5న ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్టీల్‌ప్లాంట్ వద్ద జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఆయన మృతి వార్త ఈ ప్రాంత ఉద్యమకారులను, వామపక్షవాదులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది.

# మా కేసు సీజేఐ విచారిస్తున్నారు..

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఇంట్లో జరిగిన గణపతి పూజకు ప్రధానమంత్రి మోదీ హాజరవడంపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పించాయి. బుధవారం ప్రధాని మోదీ సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ ఇంటికి వెళ్లి గణపతి పూజలో పాల్గొనడంతో పాటు హారతి కూడా ఇచ్చారు. మోదీకి సీజేఐ దంపతులు స్వాగతం పలికారు. ఈ ఫొటోలు, వీడియోను మోదీ తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ అంశాన్ని ప్రతిపక్షాలతో పాటు సుప్రీంకోర్టు న్యాయవాదులు కొందరు తప్పుపట్టారు. ప్రధాని మోదీతో కలిసి సీజేఐ తన నివాసంలో గణపతికి హారతి ఇచ్చారని, అయితే రాజ్యాంగ పరిరక్షకులు రాజకీయ నాయకులను కలవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని శివసేన (ఉద్ధవ్) నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. ‘మా కేసు సీజేఐ ముందు విచారణ జరుగుతోంది. మాకు న్యాయం జరుగుతుందా? అన్నది అనుమానంగా ఉంది. ఎందుకంటే ఈ కేసులో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామి. ఆ ప్రభుత్వానికి నరేంద్ర మోదీ నేతృత్వం వహిస్తున్నారు’ అని రౌత్ పేర్కొన్నారు. మరో నేత ప్రియాంక చతుర్వేది కూడా విమర్శలు గుప్పించారు. మోదీ, సీజేఐల కలయికను త్వరలో మహారాష్ట్రలో జరగబోయే ఎన్నికలకు ముడిపెడుతూ అనుమానాలు వ్యక్తం చేశారు. ఎన్సీపీ నేత సుప్రియా సూలే కూడా ప్రధాని వీడియో క్లిప్ చూసి ఆశ్చర్యపోయినట్లు చెప్పారు. అయితే సీజేఐపై తనకు పూర్తి నమ్మకం ఉందన్నారు. రాజ్యసభ సభ్యుడు, సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ స్పందిస్తూ.. అత్యున్నత స్థానాల్లో వ్యక్తులు తమ వ్యక్తిగత కార్యక్రమాన్ని ప్రచారం చేసుకోకూడదన్నారు. సీజేఐ వ్యక్తిత్వంపై తనకు అపార గౌరవం ఉందని చెప్పారు. కానీ, సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో క్లిప్‌ను చూసి ఆశ్చర్యపోయినట్లు తెలిపారు. సీజేఐ స్వతంత్రతపై నమ్మకం పోయిందని, ఈ విషయాన్ని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ ఖండించాలని న్యాయవాది ఇందిరా జైసింగ్ పేర్కొన్నారు. వినాయక పూజ అనేది వ్యక్తిగతమని.. ప్రధాని, సీజేఐ వంటి ఉన్నతస్థాయి వ్యక్తులు ఆ ఫొటోలను బహిరంగపర్చడం సరికాదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ షా అన్నారు. ఇక ప్రతిపక్షాలపై బీజేపీ, దాని మిత్రపక్షాలు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. ప్రతిపక్షాలు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తాయి. సర్వోన్నత న్యాయస్థానం పట్ల వారు చేస్తున్న వ్యాఖ్యలు అత్యంత ప్రమాదకరమని పేర్కొన్నాయి. బీజేపీ ఎంపీ, పార్టీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా గురువారం ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రతిపక్షాల తీరుపై మండిపడ్డారు. గతంలో ప్రధాని మన్మోహన్‌సింగ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు అప్పటి సీజేఐ హాజరవలేదా? అని ప్రశ్నించారు. ప్రధాని వెళ్లి సీజేఐని కలిస్తే అభ్యంతరం లేదని, గణపతిపూజలో పాల్గొనడమే వారికి బాధగా ఉందని వ్యాఖ్యానించారు. “ప్రధాని మోదీ సీజేఐని కలిస్తే మీకు అభ్యంతరం. కానీ, రాహుల్ గాంధీ పాక్ ఆక్రమిత కశ్మీరుకు మద్దతు పలికే అమెరికా చట్ట సభ సభ్యుడు ఇల్హాన్ ఒమర్‌ను కలిస్తే మాత్రం అభ్యంతరం వ్యక్తం చేయరు.

## కేంద్ర అధికారాలను పరిమితం చేయకపోవడంతో అంతరాలు

(మొదటి పేజీ తరువాయి)



హైదరాబాద్: కేంద్ర అధికారాలను పరిమితం చేయకపోవడం వల్ల రాష్ట్రాల అభివృద్ధికి తగినన్ని నిధులు లేకుండా పోయాయని, కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా తగ్గిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 42 శాతం నుంచి 50శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ, తమిళనాడు, కేరళ, పంజాబ్, కర్ణాటక రాష్ట్రాల ఆర్థిక శాఖ మంత్రులతో గురువారం తిరువనంతపురం లో జరిగిన ‘కేరళ కాంక్లేవ్’కు భట్టి హాజరయ్యారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో భట్టి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఆర్థిక సంబంధాలను, దక్షిణాది రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కేంద్రం, రాష్ట్రం దేనికదే బలంగా ఉంటూ తమ విధులు నెరవేర్చడానికి అవసరమైన వనరులతో కూడిన వ్యవస్థను రాజ్యాంగ నిర్మాతలు రూపొందించారని, కానీ కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా రాష్ట్రాలతో వ్యవహరిస్తోందని విమర్శించారు. కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటాను 32 శాతం నుంచి 42 శాతానికి పెంచుతూ 14వ ఆర్థిక సంఘం చేసిన నిర్ణయం తప్పుదోవ పట్టించేదేనని మండిపడ్డారు. సెస్సులు, సబ్ చార్జీల ఆదాయాన్ని కేంద్రం రాష్ట్రాలతో పంచుకోవడం లేదన్నారు. వాటిపై ఆధారపడటం వల్ల కేంద్రం స్థూల పన్ను ఆదాయం 28 శాతానికి పెరిగిందని, దీంతో రాష్ట్రాల వనరుల్లో గణనీయంగా కోత పడిందని చెప్పారు. జీఎస్టీలో అవలంబిస్తున్న విధానం వల్ల రాష్ట్రాల ఆర్థిక స్థితి దెబ్బతింటోందన్నారు. దేశ జనాభాలో 19.6 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు జీడీపీలో 30 శాతంతో గణనీయమైన సహకారం అందిస్తున్నప్పటికీ, ఫైనాన్స్ కమిషన్ పన్నుల పంపిణీలో వాటాను 21.073 శాతం నుంచి 15.800 శాతానికి తగ్గించారన్నారు. అలాగే కేంద్ర ప్రాయోజిత పథకాల కఠినమైన నిబంధనలు, మ్యాచింగ్ గ్రాంట్ షరతులు రాష్ట్ర బడ్జెట్లను ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు.

**దక్షిణాది స్వరాన్ని అణగదొక్కే కుట్ర**

రాబోయే నియోజకవర్గాల పునర్విభజన కసరత్తు 2011 జనాభా ఆధారంగా జరిపితే లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యం తగ్గుతుందని భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ నిర్ణయాధికారంలో దక్షిణాది రాజకీయ స్వరాన్ని అణగదొక్కే కుట్ర చేస్తున్నారన్నారు.

జనాభా నియంత్రణ, సామాజిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చిన రాష్ట్రాలు అన్యాయానికి గుర య్యే అవకాశం ఉందని, అధిక జనాభా ఉన్న రాష్ట్రాలు అసమాన ప్రాతినిధ్యాన్ని పొందే అవకాశం ఉందని చెప్పారు. ఒక శతాబ్దంలో ప్రతినిధుల సభలో సభ్యుల సంఖ్య గరిష్టంగా 435గా ఉండాలని నిర్ణయించిన అమెరికా విధానాన్ని మనం అనుసరించాలన్నారు.



# అరెకపూడి, కౌశిక్ రెడ్డి మధ్య జెండా జగడం

(మొదటి పేజీ తరువాయి)

అయితే, ప్రతిపక్ష ఎమ్మెల్యేకు ఇవ్వాల్సిన ఆ పదవిని బీఆర్ఎసకు రాజీనామా చేసి కొన్ని రోజుల కిందట కాంగ్రెసలో చేరిన గాంధీకి ఎలా ఇస్తారని బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. ఇందులో భాగంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి బుధవారం తీవ్రంగా స్పందించారు. “పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేలకు సిగ్గు, శరం ఉంటే స్పీకర్ నిర్ణయానికి ముందే రాజీనామా చేయాలి. లేదంటే ఆ పది మందికి చీరలు, గాజులు కొరియర్ చేస్తా.. వేసుకొని తిరగండి” అని వ్యాఖ్యానించారు. తాను కాంగ్రెసలో చేరినట్లు అప్పట్లో స్వయంగా చెప్పిన గాంధీ ఇప్పుడు దేవుడి కండువా కప్పుకొన్నానని మాట మారుస్తున్నాడని, ఆయన తమ పార్టీ సభ్యుడే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని డిమాండ్ చేశారు. లేకపోతే, గురువారం ఉదయం 11 గంటలకు ఆయన ఇంటికి వెళ్లి బీఆర్ఎస్ కండువా కప్పుతానని, ఆయన ఇంటిపై పార్టీ జెండా ఎగురవేసి, తెలంగాణ భవన్‌కు తీసుకెళ్తామని చెప్పారు. ఈ నేపథ్యంలో, ఉదయం ఏడు గంటలకే కౌశిక్ ఇంటి వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయనను హౌజ్ అరెస్ట్ చేశారు. తన ఇంటికి వచ్చి జెండా ఎగరేస్తానని కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించడంపై గురువారం ఉదయం అరెకపూడి గాంధీ తీవ్రస్థాయిలో స్పందించారు. తన ఇంటి ముందు కుర్చీ వేసుకుని కూర్చుని మీడియాతో మాట్లాడారు. రాయలేని పదజాలంతో కౌశిక్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. “నేను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనని అసెంబ్లీలో స్పీకర్ ప్రకటించారు. కౌశిక్ రెడ్డిలాంటి కోవర్టులకు నా గురించి మాట్లాడే అర్హత లేదు. 11 గంటలకు నా ఇంటికి వచ్చి జెండా ఎగుర వేస్తానన్నాడు. రాకపోతే 12 గంటలకు నేనే నీ ఇంటికి వస్తా. పార్టీలో చేరి భ్రష్టు పట్టించింది కాక పాత ముఖ్యమంత్రిని నాశనం చేశావు. కాంగ్రెస్ నుంచి కొంతమందిని తీసుకొచ్చి బీఆర్ఎసలో జాయిన్ చేస్తానని చెప్పావు. ఓ దుర్మార్గుడు నా ఇంటిపై జెండా ఎగరవేస్తానని అంటే ఊరుకుంటానా!? నా ఇంటిపై జెండా ఎగుర వేస్తానంటే ఎగుర వేయించుకునేందుకు సిద్ధంగా లేము.

# వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి బీసీలకు ఇవ్వాలి

**కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని జెండా మోసిన నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఏంటి?**

**మార్కెట్ పదవులను అమ్ముకుంటే ప్రజలే బుద్ధి చెబుతారు: జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కోట రాజు గౌడ్**



శంకర్‌పల్లి: సెప్టెంబర్ 12: (డైలీ రిపోర్ట్): శంకర్‌పల్లి మార్కెట్ పదవులను డబ్బులకు అమ్ముకుంటున్న నాయకులకు రానున్న రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటరాజు గౌడ్ అన్నారు. గురువారం శంకర్‌పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి చిన్న స్థాయి నుంచి టికెట్లు అమ్ముకునే నాయకులే కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి టికెట్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. ఇదే శంకర్‌పల్లిలో మార్కెట్ కమిటీ పదవులను డబ్బులు ఉన్న వారికి పదవులు ఇచ్చుకుంటూ పోతే 20 ఏండ్ల నుంచి కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని జెండా మోసిన నాయకులు, కార్యకర్తల పరిస్థితి ఎమిటని ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన విధానం ప్రకారం ఏ కార్యకర్త అయినా సరే జెండా మోసిన కార్యకర్తలు పదవులు ఇవ్వాలని చెప్పడం జరిగిందని, అదే విధంగా ఇవ్వాలని రాజు గౌడ్ డిమాండ్ చేశారు. లేనియెడల జెండాలు పట్టిన చేతులే ధర్నాలు రాస్తారోకోలు చేసేందుకు వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లుతామన్నారు. ఎవరైతే టికెట్లు అనుకుంటున్నారో వారిపై హై కమాండ్ కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు డబ్బులు ఇచ్చే సంప్రదాయం కాంగ్రెస్ లో లేదని, అది ఒక బీఆర్ఎస్ పార్టీలోనే ఉందని ఆ సాంప్రదాయని కాంగ్రెస్ లోకి వచ్చి చేస్తున్నారని అన్నారు. గతంలో చైర్మన్ పదవిని కూడా కాంగ్రెస్ చేవెళ్ల ఇన్చార్జి భీంభరత్ ను అడగడం జరిగిందని రాజు గౌడ్ తెలిపారు. అది కాకుండా వైస్ చైర్మన్ పదవిని బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు.

# పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

## కలెక్టర్, డీఈవోకు ఫిర్యాదు చేసిన వర్కింగ్ జర్నలిస్టులు



**చేవెళ్ల: సెప్టెంబర్ 12: (డైలీ రిపోర్ట్):** నిబంధలనకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని వర్కింగ్ జర్నలిస్టులు గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్ట్? శశాంక, జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావుకు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల వర్కింగ్ జర్నలిస్ట్? మద్దెల సురేందర్ మాట్లాడుతూ.. అక్రెడిటేషన్ ఉన్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 50 శాతం ఫీజు రాయితీపై 2024 జులై 15వ తేదీన జిల్లా విద్యాధికారి సుశీంధర్ రావు ప్రొసీడింగ్‌ను విడుదల చేశారని తెలిపారు. ప్రొసీడింగ్ పత్రంతో పాటు అక్రెడిటేషన్ (జర్నలిస్ట్? గుర్తింపు కార్డును జోడించి) తన కుమారుడు చదువున్న చేవెళ్లలోని వివేకానంద ఇంటర్‌నేషనల్ స్కూల్‌లో అందజేయగా పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ వేణు కుమార్ దురుసుగా మాట్లాడరని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవస్థలో రూల్స్? మాట్లాడితే పనులు జరగవని, ఎవరు సక్కగ పనిచేస్తున్నారని, కలెక్టర్, సంబంధిత శాఖ మంత్రి ఎవరూ సక్రమంగా పనిచేయడం లేదని ప్రిన్సిపాల్ మాట్లాడడం ఎంతవరకు సమంజసమని అన్నారు. ఈ విషయమై సెల్ ఫోన్‌లో రికార్డు చేసి కలెక్టర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తాననగా దిక్కున్నచోట చేసుకో అని అవమానకరంగా మాట్లాడడం బాధకలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పాఠశాల యాజమాన్యంపై కఠినంగా చర్యలు తీసుకోవాలని కోరామని, దీనికి కలెక్టర్, డీఈవో సానుకూలంగా స్పందించారని వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. కలెక్టర్, డీఈవోను కలిసిన వారిలో వర్కింగ్ జర్నలిస్టులు మద్దెల సురేందర్, ప్రవీణ్ కుమార్, స్థానికుడు సాయి ఉన్నారు.

# పసల్ వాది డంప్ యార్డు లో బయో మైనింగ్ పనులు వేగవంతం చేయాలి



సంగారెడ్డి సెప్టెంబర్ 12 (డైలీ రిపోర్ట్): విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు అన్నారు. గురువారం కంది ,హత్నూర మండలాలలో కలెక్టర్ క్రాంతి వల్లూరు,అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ లు కలిసి పర్యటించారు. మొదటగా పసల్ వాది లో డంప్ యార్డు పై గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో డంప్ యార్డు ను కలెక్టర్ పరిశీలించారు. డంపు యార్డులో చెత్త బయట వేయకుండా బయో మైనింగ్ చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పురపాలక శాఖతో సృష్టి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు వర్షాలు తగ్గుముఖం పట్టగానే బయోమైనింగ్ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. రోజుకు 1500 మెట్రిక్ టన్నుల చెత్తను చేసేలా ప్లాంట్ ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సంవత్సరం డిసెంబర్ నెల వరకు బయో మైనింగ్ ప్లాంటు అందుబాటులోకి రానున్నట్లు కలెక్టర్ తెలిపారు.అనంతరం ఇస్మాయిల్ ఖాన్ పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ,అంగన్వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాల, పాలిటెక్నిక్ కళాశాల ను కలెక్టర్ తనిఖీ చేశారు. పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న విద్యార్థులకు భవిష్యత్తు లో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఇటీవల వచ్చిన డెంగ్యూ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి ప్రతి రోజు డ్రై డే కార్యక్రమంలో భాగంగా జ్వర సర్వే నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. , అంగన్వాడి కేంద్రంలో కొత్తగా చేరిన పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రం ద్వారా బాలింతలు గర్భిణీ స్త్రీలకు అందుతున్న సేవలో ఎలాంటి లోపం లేకుండా పోషకాహారం అందేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల పిల్లలతో కలెక్టర్ మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. అనంతరం హత్నూర మండలం గుండ్లమాచనూర్, మోడల్ స్కూల్ ను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలో సమస్యలు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్లు దేవదాసు , పర్వీన్ షేక్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




# వినాయక చవితి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్

శంకర్‌పల్లి: సెప్టెంబర్ 12: (డైలీ రిపోర్ట్): వినాయక చవితి నిమజ్జన ఏర్పాట్లను గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్ పరిశీలించారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ ఎనిమిదవ వార్డు పరిధిలోని ఫతేపూర్ బ్రిడ్జి మూసి వాగు వద్ద క్రేన్ లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులు ఇబ్బంది పడకుండా లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు భక్తి భావంతో శోభయాత్ర జరిపించాలని సూచించారు. మూసి వాగును పరిశీలించిన వారిలో సీఐ హబీబుల్లాఖాన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ రాములు, నాయకులు కాశెట్టి మోహన్, యాదయ్య గౌడ్, యాదిరెడ్డి, ఆర్అండ్ బి డిఈ, ఏఈ, అధికారులు పాల్గొన్నారు.

# అన్నం పరబ్రహ్మ స్వరూపం

## చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి: సెప్టెంబర్ 12: (డైలీ రిపోర్ట్): అన్నం పరబ్రహ్మ స్వరూపం అని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. గురువారం శంకర్‌పల్లి మున్సిపల్ పరిధి విఠలేశ్వర ఆలయంలో కొలువుదీరిన గణేశునికి ఎమ్మెల్యే ఆలయ పూజారి రాజేశ్వర్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గజనాధుడి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం పూర్తిగా పండగ వాతావరణాన్ని తలపించింది. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్ కుమార్, కౌన్సిలర్లు వాణి ప్రకాష్, చంద్రమౌళి, లక్ష్మమ్మ రాంరెడ్డి, కాశెట్టి మోహన్, ఉప్పు సత్యం, ధనుంజయ్, ఉప్పు నర్సింలు, సూర్యం, సత్యనారాయణ, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచం ఉపయోగకరం

- తాటి గీత కార్మికులకు కాటమయ్య సేఫ్టీ కిట్స్ వినియోగంపై శిక్షణ
- సేఫ్టీ కిడ్స్ వినియోగం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం తక్కువ
- జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్



**సంగారెడ్డి సెప్టెంబర్ 12 (డైలీ రిపోర్ట్):** కాటమయ్య సేఫ్టీ కిట్స్ వినియోగించడం వల్ల గీత కార్మికులు ప్రమాదాల నుండి రక్షణ పొందవచ్చు అని జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్ అన్నారు. గురువారం జిల్లాలోని 41 మంది గీత కార్మికులకు సుల్తాన్పూర్ సమీపంలో కొర్పోల్ రోడ్డులో కాటమయ్య సేఫ్టీ కిట్స్ వినియోగంపై శిక్షణ కార్యక్రమాన్ని ఎక్సైజ్ శాఖ,బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గీత కార్మికులు తాటి చెట్లపై నుండి పడి ఎంతోమంది మరణిస్తున్నారని అలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు కాటమయ్య సేఫ్టీ కిడ్స్ ఉపయోగపడతాయన్నారు . ఈ సేఫ్టీ కిట్స్ తాటి చెట్లు ఎక్కినప్పుడు కింద పడకుండా మోపు జారకుండా ఉండేందుకు దృఢమైన బెల్ట్ తాడు, మూడు క్లిప్పులు ఉంటాయన్నారు . గతంలో మోకుజారి కిందపడి ఎంతోమంది గీత కార్మికులు చనిపోయారని, కొంతమంది కాళ్లు చేతులు విరిగిపోయాయి, గీత పని వృత్తికి దూరమయ్యారని అలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ఉపయోగపడతాయన్నారు. ఈ సందర్భంగా గీత కార్మికులు కు సెప్టిక్ వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గీత కార్మికులు చెట్లు ఎక్కే సమయంలో కాటమయ్య సేఫ్టీ కిట్స్ను వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అప్కారి శాఖ సూపర్డెంట్ మాణమ్మ, జోగిపేట సిఐ సాగర్ రెడ్డి, జిల్లా కల్లు గీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఆసన్న గౌడ్జి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగారెడ్డి,వసంత్ గౌడ్ రవీందర్ గౌడ్, విట్టల్ గౌడ్ ఇతర నాయకులు, సహాయ వెనుకబడిన తరగతులు అభివృద్ధి అధికారులు, అమర జ్యోతి,భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు..



# ఆ ఫ్రాంచైజీని కొనుగోలుతో నా కల నెరవేరింది: సమంత

వరల్డ్ పికిల్‌బాల్ లీగ్ చెన్నై ఫ్రాంచైజీని కొనుగోలు చేసినట్లు అగ్ర కథానాయిక సమంత ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. తన జీవితంలో ఇదొక కొత్త ఆరంభమని ఆనందం వ్యక్తం చేసింది. తాజాగా ఈ భామ ఇన్‌స్టాగ్రామ్‌లో పికిల్‌బాల్ గేమ్ ఆడుతున్న వీడియో ఒకటి షేర్ చేసింది. ఇందులో సమంత ఎంతో ఎనర్జిటిక్‌గా కనిపించింది. ఈ వీడియోను చూసిన వారు గేమ్ పట్ల సమంత పట్టుదల చూసి ఆశ్చర్యపోతున్నారు. చిన్నతనం నుంచి తనకు ఆటలంటే చాలా ఇష్టమని, ఫ్రాంచైజీని కొనుగోలు చేయడంతో తన కల నెరవేరిందని సమంత పేర్కొంది. 'పాఠశాల రోజుల్లో స్పోర్ట్స్‌పై ఎంతో మక్కువ ఉండేది. అయితే నా పేరెంట్స్ మాత్రం ఆటలపై దృష్టి పెడితే చదువును నిర్లక్ష్యం చేస్తానేమోనని భయపడేవారు. అలా ఆటలకు దూరమయ్యాను. ఆ తర్వాత స్పోర్ట్స్ విలువేమిటో తెలిసొచ్చింది. అవి మనల్ని ఆరోగ్యంగా వుంచడమే కాకుండా ఆత్మవిశ్వాసంతో జీవితాన్ని సాగించేలా ధైర్యాన్నిస్తాయి' అని సమంత చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్‌మీడియాలో అందరిని ఆకట్టుకుంటున్నది. ఇక సినిమాల విషయానికొస్తే స్వీయ నిర్మాణంలో సమంత 'మా ఇంటి బంగారం' అనే చిత్రాన్ని రూపొందిస్తున్నది.



# త్రిష లైనప్.. ఒకే సీజన్‌లో రెండు సినిమాలు..?

సాధారణంగా సంక్రాంతి బరిలో బాక్సాఫీస్ వద్ద స్టార్ యాక్టర్ల సినిమాల సందడి ఉంటుందని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే ఒకే టైం స్టార్ హీరోల సినిమాల రిలీజవడం చూస్తుంటాం.. కానీ స్టార్ హీరోయిన్ సినిమాలు ఒకే సమయంలో విడుదల కావడం అరుదుగా కనిపిస్తుంటుంది. ఇంతకీ ఆ స్టార్ నటి ఎవరనే కదా మీ డౌటు. ఇంకెవరో కాదు చెన్నై సుందరి త్రిష ఈ బ్యూటీ ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టింది. త్రిష మెగాస్టార్ చిరంజీవి నటిస్తోన్న విశ్వంభరలో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. మరోవైపు అజిత్ కుమార్ నటించిన విదాముయార్చిలో హీరోయిన్‌గా నటిస్తోంది. విశ్వంభర జనవరి 10న విడుదల కానున్నట్టు ప్రకటించారు మేకర్స్. మరోవైపు విదాముయార్చి జనవరి 12న రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇదే నిజమైతే ఒకే సారి త్రిష నటించిన ఈ రెండు సినిమాల మధ్య పోరు ఉండనుందన్నమాట. మరి మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వస్తే మాత్రం.. రెండు సినిమాల మధ్య ఎలా ఉంటుందనేది సర్వత్రా ఆసక్తికరంగా మారనుంది.త్రిష మరోవైపు లెజెండరీ డైరెక్టర్ మణిరత్నం దర్శకత్వంలో కమల్ హాసన్ టైటిల్ రోల్ పోషిస్తున్న థగ్ లైఫ్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. థగ్ లైఫ్ షూటింగ్ దశలో ఉంది. ఇటీవలే బృందా వెబ్ ప్రాజెక్ట్‌తో సూపర్ సక్సెస్ అందుకుంది త్రిష. ఈ భామ మలయాళంలో ఐడెంటిటీ సినిమా చేస్తోంది. దీంతోపాటు మోహన్‌లాల్ నటిస్తోన్న రామ్‌లో హీరోయిన్‌గా నటిస్తుండగా.. ఈ ప్రాజెక్ట్ పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది.

# నా జర్నీ ఇప్పుడే మొదలయ్యింది

మిస్టర్ బచ్చన్ బ్యూటీ భాగ్యశ్రీ భోర్సే కొన్ని రోజులుగా నెట్టింట మార్మోగుతున్న పేరు భాగ్య శ్రీ బోర్సే .ఇటీవలే మాస్ రవితేజ-హరీష్ శంకర్‌కాంబినేషన్‌లో వచ్చిన 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హాయ్ చెప్పింది. సినిమా విడుదల కాకముందే ఏదో ఒక స్టిల్‌తో నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ చిత్రం ఊహించని డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. సినిమా హిట్టా.. ఫట్టా అనేది పక్కన పెడితే.. తెలుగులో ఇది మొదటి సినిమా కాబట్టి నటిగా తన ఫీలింగ్‌ను అందరితో షేర్ చేసింది. మీ అమ్మాయిపై మీరంతా చూపిస్తున్న ప్రేమ ఊహించలేనిది. నా ప్రయాణం కేవలం ఇప్పుడే మొదలైంది. నా నెక్స్ట్ చాప్టర్‌ను మీతో పంచుకునేందుకు వేచి ఉండలేకపోతున్నా.. అంటూ సోషల్ మీడియాలో రాసుకొచ్చింది భాగ్య శ్రీ బోర్సే. మొత్తానికి భాగ్య శ్రీ బోర్సే సక్సెస్‌ఫుల్‌గా జర్నీ సాగించాలంటే హిట్టు, ఫ్లాపులను ఒకేలా స్వీకరించాలంటూ చెప్పకనే చెబుతోంది. ఈ భామ ప్రస్తుతం విజయ్ దేవరకొండ హీరోగా గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తున్న వీడీ 12 చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తోంది. దుల్కర్ సల్మాన్ నటిస్తోన్న చిత్రంలో కూడా ఫీ మేల్ లీడ్ రోల్‌లో కనిపించబోతున్నట్టు వార్తలు వస్తుండగా.. వీటిపై క్లారిటీ రావాల్సి ఉంది.






# బాలీవుడ్ మొత్తం కుట్రలే.. అక్కడ ప్రతిభ ఉన్న వారికి గుర్తింపు లభించదు: కంగనా రనౌత్

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రం 'ఎమర్జెన్సీ' సెప్టెంబర్ 6న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందిరాగాంధీ పాత్రలో కంగనా రనౌత్ నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నది. ఈ సందర్భంగా ఓ జాతీయ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బాలీవుడ్ సినీరంగంపై కంగనా రనౌత్ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. ప్రతిభ ఉన్న వారికి బాలీవుడ్‌లో గుర్తింపు లభించదని, అలాంటి వారిని అణగదొక్కడానికి కుట్రలు చేస్తారని ఆరోపించింది. ఇండస్ట్రీపై ధిక్కార స్వరం వినిపించినందుకే ఓ సమయంలో తనను బహిష్కరించారని పేర్కొంది. 'నా దృష్టిలో బాలీవుడ్ ఎలాంటి కనికరం లేని ప్రదేశం. ఇక్కడ ఎవరైనా ఎదుగుతుంటే అసూయ పడతారు. ప్రతిభావంతుల కెరీర్‌ను ఎలా నాశనం చేయాలని నిరంతరం ప్రణాళికలు రచిస్తుంటారు. పీఆర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని వారిపై దుష్ప్రచారం చేయిస్తారు. చివరకు ఇండస్ట్రీ నుంచి వారిని వెలివేసేలా పరిస్థితులను సృష్టిస్తారు' అని కంగనా రనౌత్ వ్యాఖ్యానించింది. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.

# సస్పెన్స్ థ్రిల్లర్ 'వీక్షణం'

రామ్ కార్తీక్, కశ్వి జంటగా నటిస్తున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకుడు. పద్మనాభ సినీ ఆర్ట్స్ పతాకంపై పి.పద్మనాభ రెడ్డి నిర్మిస్తున్నారు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. తాజాగా ఈ సినిమా నుంచి 'ఎన్నెన్నో..' అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు. మెలోడీ ప్రధాన ప్రేమగీతంగా ఈ పాటను తీర్చిదిద్దారు. సమర్థ్ గొల్లపూడి సంగీతాన్ని అందించిన ఈ పాటను రెహ్మాన్ రాయగా సిధ్ శ్రీరామ్ ఆలపించారు. సస్పెన్స్, మిస్టరీ, థ్రిల్లింగ్ అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని, చిత్రీకరణ పూర్తయిందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: సాయిరామ్ ఉదయ్, సంగీతం: సమర్థ్ గొల్లపూడి, దర్శకత్వం: మనోజ్ పల్లేటి.



Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707